# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 26-02-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **అంటు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించిన కేంద్రమంత్రి కె. రామ్మోహన్ నాయుడు.**

2. **రాష్ట్రంలో క్రీడాకారులకు ఉద్యోగాల నియామకాలలో 3 శాతం మేర రిజర్వేషన్‌లు అమలు చేస్తున్నామని పేర్కొన్న క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్.**

3. **నిబంధనలను అతిక్రమించి కల్తీ పాల వ్యాపారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించిన పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్.**

4. **ప్రముఖ స్వాతంత్ర సమర యోధులు అయ్యదేవర కాళీశ్వరరావు వర్ధంతి ఈరోజు.**

==========================

అంటు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు అధికారులను ఆదేశించారు. శ్రీకాకుళంలో అతిసార ప్రభావిత ప్రాంతాల్లో స్థానిక శాసన సభ్యులు జి. శంకర్‌తో కలిసి ఈరోజు పర్యటించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ.. వైద్య బృందాలు ఆరోగ్య సర్వేను నిర్వహిస్తున్నాయని తెలిపారు. ప్రజలు ఎటువంటి ఆందోళన చెందవద్దని సూచించారు.

--------------------------

రాష్ట్ర శాసన సభ బడ్జెట్ సమావేశాలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం శాసనసభలో ప్రశ్నోత్తరాలు కొనసాగుతున్నాయి. రాష్ట్రంలో వివిధ సమస్యలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రులు సమాధానాలు ఇచ్చారు. ఇవాళ సభలో అసైన్డ్ భూముల చట్ట సవరణ బిల్లును రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, గ్రామ, వార్డు సచివాలయాల సవరణ బిల్లును మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ప్రవేశపెట్టనున్నారు. అలాగే జలవనరుల శాఖపై ప్రత్యేక చర్చ జరుగుతుంది. మంత్రి నిమ్మల రామానాయుడు జలవనరుల శాఖకు సంబంధించిన బడ్జెట్‌పై చర్చను ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై వివరాలను తెలియజేయనున్నారు.

--------------------------

---------------------------

రాష్ట్రంలో క్రీడాకారులకు ఉద్యోగాల నియామకాలలో 3 శాతం మేర రిజర్వేషన్‌లు అమలు చేస్తున్నామని క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ తెలిపారు. క్రీడాకారులు, ఎన్‌సీసీ అభ్యర్థులకు ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్లపై శాసనసభలో సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ.. క్రీడాకారుల ప్రోత్సాహానికి ప్రభుత్వం ప్రాధాన్యతను ఇస్తోందని తెలిపారు. డీఎస్సీ నియామకాల్లో రాత పరీక్షలతో సంబంధం లేకుండా క్రీడా నైపుణ్యాల మేరకు 426 మందికి ఉద్యోగాలు కల్పించినట్లు చెప్పారు. మిగతా నియామకాల్లో కూడా ఈ విధానాన్ని అమలు చేసే విషయాన్ని పరిశీలిస్తున్నామని మంత్రి పేర్కొంటూ ,.

వాయిస్..30 సెకన్లు

---------------------------

భూగర్భజల వనరుల అంచనా, సమర్ధ నిర్వహణ, వినియోగానికి కృత్రిమ మేధ –ఏఐ ఆధారిత సాంకేతిక పద్ధతులను విస్తృతంగా ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉందని కేంద్ర భూగర్భ జల వనరుల బోర్డు సభ్యులు ఎన్.వరదరాజ్ అన్నారు. విజయవాడలో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రానికి సంబంధించిన భూగర్భ జలాల సమాచారం, జలధార పొరల గుర్తింపు ఫలితాల ప్రచారంపై రాష్ట్రస్థాయి కార్యశాలను నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భూగర్భ జల వనరులు–2025 నివేదికను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, వాతావరణ మార్పులు, వర్షపాతంలో లోపాలు, అధిక వినియోగంతో భూగర్భ జలాలు తగ్గుతున్న కారణంగా శాస్త్రీయ ఆధారిత సమాచార సేకరణ, విశ్లేషణ అత్యంత అవసరమని పేర్కొన్నారు.

---------------------------

శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నియోజకవర్గంలో బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్ పనులను ప్రభుత్వమే చేపట్టనుందని మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో ఫిషింగ్ హార్బర్ పనులపై శాసనసభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ, ఫిషింగ్ హార్బర్ అభివృద్ధి ప్రతిపాదన ప్రభుత్వం పరిశీలనలో ఉందని తెలిపారు. అనుమతులు వచ్చిన తర్వాత టెండర్లు పూర్తి చేసి, పనులు ప్రారంభించి, పూర్తి చేస్తామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్..30 సెకన్లు

---------------------------

నిబంధనలను అతిక్రమించి కల్తీ పాల వ్యాపారం చేసే వారిపై కఠిన చర్యలు తీసు కుంటామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ హెచ్చరించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో కల్తీ పాలు సేవించి స్థానిక ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న బాధితులను ఈరోజు పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, ప్రస్తుతం చికిత్స పొందుతున్న బాధితులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ ..30 సెకన్లు

---------------------------

ప్రజలకు నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తోందని మైలవరం శాసనసభ్యులు వసంత వేంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని కిలేశపురం గ్రామంలో 4.2 కోట్ల రూపాయలతో ఏర్పాటు చేయనున్న విద్యుత్తు ఉపకేంద్రం నిర్మాణానికి ఆయన ఈ రోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా ఉపకేంద్రం నిర్మాణాన్ని చేపట్టినట్లు వెల్లడించారు. దీని ద్వారా నాణ్యమైన విద్యుత్తు అందుబాటులోకి వస్తుందని తెలిపారు.

---------------------------

ప్రముఖ స్వాతంత్ర సమర యోధులు అయ్యదేవర కాళేశ్వరరావు వర్ధంతి ఈరోజు. ఈ సందర్భంగా దేశానికి, రాష్ట్రానికి ఆయన చేసిన సేవలను ప్రజలు స్మరించుకుంటున్నారు. 1882 జనవరి 22వ తేదీన కృష్ణా జిల్లా నందిగామలో జన్మించిన ఆయన. మహాత్మా గాంధీ నాయకత్వంలో స్వాతంత్ర్యోద్యమంలోని అన్ని ఘట్టాల్లో చురుకుగా పాల్గొని పలు మార్లు జైలు శిక్ష అనుభవించారు. స్వాతంత్ర్యం అనంతరం ఆంధ్రప్రదేశ్ శాసనసభ మొట్ట మొదటి సభాపతిగా పనిచేశారు. 1960లో పద్మభూషణ్ అవార్డును అందుకున్న అయ్యదేవర కాళేశ్వరరావు 1962 ఫిబ్రవరి 26 న తుది శ్వాస విడిచారు.

---------------------------

వ్యవసాయ సేవలను సులభతరం చేసేందుకు భూకమతాలు ఉన్న ప్రతి రైతుకు 11 అంకెలు గల ప్రత్యేక గుర్తింపు సంఖ్యను కేంద్ర ప్రభుత్వం కేటాయిస్తోందని అనంతపురం జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు ఎం.రవి తెలిపారు. అనంతపురంలోని జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో ఆయన ఈ రోజు మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా మొత్తం 3 లక్షల మంది రైతులు ఉన్నారని, వీరిలో ఇప్పటివరకు దాదాపు 2 లక్షల 88 వేల 160 మంది రైతులు విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం నమోదు చేసుకున్నారని చెప్పారు. గుర్తింపు సంఖ్య నమోదు కోసం రైతులు దగ్గరలో ఉన్న రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు.

---------------------------

2029 నాటికి జిల్లాలో సంపూర్ణ వయోజన అక్షరాస్యత సాధించడమే అక్షరాంధ్ర లక్ష్యమని విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత ఉల్లాస్ పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అక్షరాంధ్ర పథకం కింద వయోజనులకు విద్య కోసం ప్రీ-ఫైనల్ ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ అసెస్‌మెంట్ పరీక్షను ఈ నెల 28న విశాఖపట్నం జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఈ రోజు ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన ప్రతి వయోజన విద్యార్థి పరీక్షకు హాజరుకావాలని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 15 సంవత్సరాలు పైబడిన, విద్యకు దూరమైన వయోజనులకు చదువు, జీవన నైపుణ్యాలు అందించడమే లక్ష్యంగా అక్షరాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు.

---------------------------

తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి వారి సాలకట్ల తెప్పోత్సవాలు ఈ రోజు నుంచి వచ్చే నెల 2 వ తేదీ వరకు జరగనున్నాయి. రాత్రి 7 నుంచి 8 గంటల వరకు స్వామి, అమ్మవార్లు తిరుమల ఆలయంలో గల పుష్కరిణిలో విహరిస్తూ భక్తులకు దర్శనమిస్తారు. తొలిరోజైన ఈ రోజు శ్రీ సీతాలక్ష్మణ ఆంజనేయ సమేత శ్రీరామచంద్రమూర్తి అవతారంలో మలయప్ప స్వామివారు పుష్కరిణిలో విహరిస్తారు.

====================